క్లుప్తంగా

పర్యావరణహిత రంగులు వాడాలి

ఆదిబట్ల సీఐ రాఘవేందర్‌రెడ్డి



ఇబ్రహీంపట్నం రూరల్: హోలీ పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలని ఆదిబట్ల సీఐ రాఘవేందర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. కలిసి మెలిసి ఉత్సవాలు జరుపుకోవాలన్నారు. కెమికల్ రంగులకు బదులు సంప్రదాయ రంగులు(పర్యావరణానికి హాని కలిగించని) వాడాలని సూచించారు. ఎదుటివారికి ఇబ్బంది కలిగించవద్దన్నారు. యువత వాహనాలను వేగంగా నడపవద్దన్నారు. ప్రార్థన మందిరాల వద్ద రంగులు చల్లవద్దన్నారు. తల్లిదండ్రులు పిల్లల పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు.

ఇంజాపూర్ నూతన కమిటీ ఎన్నిక



నూతన కమిటీ సభ్యులతో నాయకులు

తుర్కయంజాల్: పురపాలక సంఘం పరిధి ఇంజాపూర్‌లోని అభ్యుదయ సంక్షేమ సంఘం నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఉపేందర్, గౌరవ అధ్యక్షుడిగా రవిశేఖర్, ఉపాధ్యక్షులుగా చరణ్, రమేష్, కార్యదర్శి బాలయ్య, అధికార ప్రతినిధి వంశీ, కోశాధికారి నరేందర్, కార్యనిర్వాహక కార్యదర్శి రాజు, సహాయ కార్యదర్శి చంద్రశేఖర్‌ను ఎన్నుకున్నారు. కమిటీ సభ్యులను నిర్వాహకులు సన్మానించారు

27 నుంచి ప్రతిష్ఠాపనోత్సవాలు



అయ్యప్పస్వామి నూతన ఆలయం

ఇబ్రహీంపట్నం: రాయపోల్ గ్రామ పరిధిలో అయ్యప్పస్వామి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠాపనోత్సవాలు ఈనెల 27న ప్రారంభమై 29 వరకు కొనసాగుతాయని ఆహ్వాన కమిటీ సభ్యుడు, గురుస్వామి అశోక్‌గౌడ్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. గ్రామ పరిధిలోని జనహర్షలో గల జీఫేస్‌లో నిర్మించిన అయ్యప్ప దేవాలయంలో ఈ వేడుకలు జరుగుతాయని తెలిపారు. అయ్యప్ప స్వామితోపాటు నవగ్రహాలు, అభయాంజనేయ స్వామి విగ్రహాల ప్రతిష్ఠాపన ఉంటుందని తెలిపారు. బ్రహ్మశ్రీ రంజిత్ తాంత్రి బృందం, శ్రీ చంద్రమోహన్ నాయర్ గురుస్వామి ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహిస్తామన్నారు. అయ్యప్ప స్వాములు, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. కుంట్లూరి రాములు అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నారు.

క్రీడలతో ఆరోగ్యం



పోటీలను ప్రారంభిస్తున్న మేయర్ పారిజాత

బడంగ్‌పేట్: క్రీడలతో ఆరోగ్యం చేకూరుతుందని మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ చిగురింత పారిజాత పేర్కొన్నారు. కార్పొరేషన్ పరిధిలోని నాదర్‌గుల్‌లో ప్రీమియర్ లీగ్ (ఎన్‌పీఎల్)టోర్నమెంట్‌ను ఆదివారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా చిగురింత పారిజాత మాట్లాడుతూ మానసికోల్లాసానికి క్రీడలు ఎంతగానో దోహదపడుతాయన్నారు. ఈ కార్యక్రమంలో పీసీసీ ప్రోటోకాల్ కార్యదర్శి బంగారి బాబు, స్థానికులు యెల్చెల పురుషోత్తంరెడ్డి, సుభాన్‌యాదవ్, సుభాష్‌రెడ్డి, విజయ్, హరి, అనీల్, రజని, హరీశ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

కడ్తాల్: మండల పరిధిలోని మైసిగండికి చెందిన జఠావత్ గోర్యానాయక్ అనారోగ్యంతో ఇటీవల మృతి చెందాడు. బాధిత కుటుంబాన్ని ఆదివారం బీజేపీ నాయకులు రాందాస్ నాయక్ పరామర్శించి రూ.5 వేలు ఆర్థికసాయం అందించారు. పరామర్శించిన వారిలో జవహర్‌లాల్, జగన్, పాండు, కుమార్, మురళి తదితరులు ఉన్నారు.

లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌దే గెలుపు

మున్సిపల్ అధ్యక్షుడు లక్ష్మయ్య

తుక్కుగూడ: లోక్‌సభ ఎన్నికల్లో చేవెళ్ల గడ్డపై బీఆర్‌ఎస్‌దే గెలుపు ఖాయమని తుక్కుగూడ మున్సిపాలిటీ అధ్యక్షుడు లక్ష్మయ్య యాదవ్ పేర్కొన్నారు. ఆదివారం మున్సిపాలిటీ కేంద్రంలో ఆయన మాట్లాడుతూ.. ప్రజలు కాంగ్రెస్, బీజేపీలను నమ్మే పరిస్థితి లేదన్నారు. బీఆర్‌ఎస్ చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించాలన్నారు. పార్టీ ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ గెలుపు కోసం కార్యకర్తలు కృషి చేయాలన్నారు. శ్రీధర్‌గౌడ్, వెంకట్‌రాజీరెడ్డి, శ్రీనివాస్, శ్యామేల్ రాజు, బుచ్చిరెడ్డి, సురేశ్, హరికృష్ణా రెడ్డి, రాజు పాల్గొన్నారు.

కార్యకర్తలే కాంగ్రెస్‌కు బలం

- ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి
- హస్తం గూటికి కృష్ణాగౌడ్



ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన కృష్ణాగౌడ్

హయత్‌నగర్: బీఆర్‌ఎస్ సీనియర్ నేత, జిల్లా పరిషత్ కాంగ్రెస్ మాజీ ఫ్లోర్ లీడర్ నోముల కృష్ణాగౌడ్ కాంగ్రెస్ గూటికి చేరారు. ఆయనతో పాటు తుర్కయాంజాల్ మున్సిపాలిటీకి చెందిన కౌన్సిలర్లు కీర్తనారెడ్డి, మాధవి.. స్థానిక ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి సమక్షంలో ఆదివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... వంద రోజుల పాలనలో ఇచ్చిన హామీలను నిలబెట్టుకున్నామన్నారు. అభివృద్ధి, సంక్షేమాన్ని చూసే పెద్ద సంఖ్యలో నాయకులు పార్టీలో చేరుతున్నారన్నారు. కార్యకర్తలే పార్టీకి బలం అన్నారు. కష్టపడి పనిచేసేవారికి తగిన గుర్తింపు ఇస్తామన్నారు.

అవినీతిపై ఉక్కుపాదం..

నియోజకవర్గంలోని మున్సిపాలిటీ, మండల అధికారులు అవినీతికి పాల్పడితే సహించేది లేదని.. ఎక్కడైనా అవినీతి జరిగినట్లు తేలితే చర్యలు తప్పవని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. మున్సిపాలిటీ అభివృద్ధికి సుమారు వంద కోట్ల రూపాయలు వరకు తీసుకొస్తానని, ఇప్పటికే దీనిపై సీఎం హామీ ఇచ్చారని తెలిపారు. మున్సిపాలిటీల్లో అభివృద్ధిని నిత్యం పర్యవేక్షిస్తున్నామని, ఏ సమస్యలు ఉన్నా తన దృష్టికి తేవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, కౌన్సిలర్లు ఉదయశ్రీ, కవిత, నాయకులు.. శంకరయ్య, శివకుమార్, అశోక్‌గౌడ్, వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మరమ్మతులు చేపట్టరూ..



దర్గా వద్ద రోడ్డుపై ఏర్పడిన గుంత

- మండల కేంద్రంలోని సీసీ రోడ్డుపై గుంతలు
- ప్రమాదాలబారిన పడుతున్న వాహనదారులు
- పట్టించుకోని ఆర్‌అండ్‌బీ అధికారులు

యాచారం: నాగార్జునసాగర్–హైదరబాద్ రహదారిపై యాచారం మండల కేంద్రంలోని సీసీ రోడ్డుపై పలుచోట్ల గుంతలు ఏర్పడ్డాయి. వివరాల్లోకి వెళ్తే.. ఐదేళ్ల కింద యాచారం మండల కేంద్రంలో యాచారం పీఏసీఎస్ కార్యాలయం నుంచి గాండ్లగూడెం వరకు రోడ్డుకు ఇరువైపులా సీసీ రోడ్డు వేశారు. రోడ్డు వేసే సమయంలో 25 ఏళ్లకు పైగా సీసీ రోడ్డుకు ఢోకా ఉండదని రోడ్డు భవనాల శాఖ అధికారులు తెలియజేశారు. అయితే పదేళ్లు కూడా పూర్తి కాకుండానే సీసీ రోడ్డుపై పలుచోట్ల గుంతలు ఏర్పడ్డాయి. దాదాపు 10 చోట్లకు పైగా గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా మారింది. నిత్యం ఈ రోడ్డుపై వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. గుంతలు ఉన్నచోట వాహనాలు అదుపు తప్పుతున్నాయి. ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.

క్యామను గెలిపించుకుందాం

బీఆర్‌ఎస్ మండల ప్రధాన కార్యదర్శి భాషా



యాచారం: భువనగిరి పార్లమెంట్ స్థానం నుంచి బీఆర్‌ఎస్ పార్టీ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న క్యామ మల్లేషను అత్యధిక మెజార్టీతో గెలిపించుకుందామని యాచారం మండల బీఆర్‌ఎస్ మండల ప్రధాన కార్యదర్శి పాశ్య భాషా పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు కోసం ఉద్యమాలు చేసిన నేత, బడుగుబలహీనవర్గాలకు నాయకుడిగా గుర్తింపు పొందిన క్యామ మల్లేశ్‌కు బీఆర్‌ఎస్ టికెట్ అవ్వడం హర్షణీయమన్నారు. అత్యధిక మెజార్టీతో క్యామను గెలిపించుకుందామని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలు ఐక్యంగా ఉండి క్యామను గెలిపించుకోవాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు.

కడ్తాల్‌లో కాముని దహనం



కాముని దహనం నిర్వహిస్తున్న ప్రజలు

కడ్తాల్: హోలీ పండుగను పురస్కరించుకుని మండల పరిధిలోని పలు గ్రామాల్లో ఆదివారం రాత్రి కాముని దహన కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక నాయకులు మాట్లాడుతూ.. సోమవారం హోలీ పండుగను సంతోషంగా జరుపుకోవాలని, పర్యావరణహిత రంగులనే వాడాలని సూచించారు. కరెంట్ పోల్‌ల వద్ద, జంక్షన్ల వద్ద, ఎలక్ట్రానిక్ పరికరాలు, చార్జింగ్ పెట్టేటప్పుడు హోలీ ఆడే యువత జాగ్రత్తగా ఉండాలని కోరారు. చిన్నపిల్లలను కంట కనిపెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎంపీటీసీ సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, మాజీ సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి, నాయకులు భాస్కర్‌రెడ్డి, శ్రీనివాస్, వెంకటేశ్, వెంకటేశ్వర శర్మ, వెంకటేశ్, నరేందర్‌రెడ్డి, ఆంజనేయులు, మహేశ్, పెంటారెడ్డి, రాజేశ్, గణేశ్, సత్యం యాదవ్, పాండు యాదవ్ పాల్గొన్నారు.

మత్స్యకారులను ఆదుకోవాలి

మాజీ సర్పంచ్ శ్రీశైలం



సాయికుమార్‌కు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న నాయకులు

తలకొండపల్లి: మత్స్యకారుల జీవితాల్లో వెలుగులు తీసుకురావాలని మాజీ సర్పంచ్ శ్రీశైలం, ఫిషరీస్ కోఆపరేటివ్ సొసైటీ ఫెడరేషన్ చైర్మన్ సాయికుమార్‌ను కోరారు. రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా, విద్య, ఉపాధి తదితర అనేక రంగాల్లో మత్స్యకారులు వెనుబడిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఫిషరీస్ కోఆపరేటివ్ సొసైటీ ఫెడరేషన్ చైర్మన్‌గా సాయికుమార్ ఇటీవల నియమితులయ్యారు. ఆదివారం హైదరాబాద్‌లో సాయి కుమార్‌ను శ్రీశైలం మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. మత్స్యకారుల ఆర్థికాభివృద్ధికి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. గత ప్రభుత్వాలు మత్స్యకారుల అభివృద్ధికి ఏలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. అదేవిధంగా మండల పరిధిలోని దేవుని పడకల్ శ్రీ వేంకటేశ్వర ఆలయంలో కొనసాగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈనెల 28న స్వామివారి కల్యాణాన్ని నిర్వహించనున్నారు. స్వామి పెళ్లికి రావాలని, బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికను మెట్టు సాయి కుమార్‌కు శ్రీశైలం అందజేశారు. వైభవంగా నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శ్రీశైలం, భిక్షపతి, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌బీనగర్ ఓటర్లు 5,98,918

- పురుషులు 3,11,311
- మహిళలు 2,87,474
- ఇతరులు 133 మంది
- యువత 10,874
- అత్యధికంగా 30–39 వయస్సుగల ఓటర్లు 1,67,972 మంది
- 120 వయస్సుగల ఓటర్లు ఇద్దరు



ఎల్‌బీనగర్: ఎల్‌బీనగర్ నియోజకవర్గంలో ప్రస్తుతం ఓటర్లు 5,98,918 మంది ఉన్నారు. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే నాటికి ఈ సంఖ్య పెరిగే అవకాశం ఉందని అధికారులు అంటున్నారు. నియోజకవర్గంలో 120 సంవత్సరాలు దాటిన ఓటర్లు ఇద్దరు ఉన్నారు. వీరిలో ఒకరు పురుషుడు కాగా, మరొకరు మహిళ. మొత్తం ఓటర్లలో పురుష ఓటర్లు 3,11,311 మంది కాగా.. మహిళా ఓటర్లు 2,87,474 మంది ఉన్నారు. ఇతర ఓటర్లు 133 మంది ఉన్నారు. వివిధ వయస్సు గల ఓటర్లను పరిశీలిస్తే యువ ఓటర్ల కంటే అత్యధికంగా 30–39 వయస్సు గల వారే అధికంగా ఉన్నారు. యువ ఓటర్లు 10,874 మంది ఉండగా, వీరిలో 30–39 మధ్య వయస్సు వారు 1,67,972 మంది ఉన్నారు.

వయస్సుల వారీగా ఓటర్ల వివరాలు ఇలా..

వయసు	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
18-19	5930	4940	4	10,874
20-29	50942	46,504	53	97,499
30-39	84,290	83,639	43	1,67,972
40-49	71,215	66,997	14	1,38,226
50-59	48,440	43,888	7	92, 335
60-69	30,099	25,167	6	55,272
70-79	15,728	12,144	4	27,876
80-89	4,044	3,480	1	7,525
90-99	580	667	1	1,248
100-109	40	46	0	86
110-119	2	1	0	3
120	1	1	0	2
మొత్తం	3,11,311	2,87,474	133	5,98,918

మెజార్టీ ఎంపీ స్థానాలు గెలుస్తాం

నాగర్‌కర్నూల్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి మల్లురవి



మల్లురవి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన శ్రీనునాయక్

ఆమనగల్లు: రాష్ట్రంలో మెజార్టీ ఎంపీ స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధిస్తుందని నాగర్ కర్నూల్ పార్లమెంటు నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి డా.మల్లురవి దీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పాలన పట్ల ప్రజల్లో విశ్వాసం పెరిగిందని ఆయన అన్నారు. హైదరాబాద్‌లోని డా.మల్లురవి నివాసంలో ఆయన సమక్షంలో ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని చంద్రాయణపల్లి తండాకు చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు శ్రీనునాయక్, మాజీ సర్పంచ్ గుర్రం కేశవులు ఆదివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. శ్రీనునాయక్‌కు ఆయన కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మల్లురవి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన అన్ని హామీలను నెరవేరుస్తూ ప్రజారంజక పాలన సాగిస్తుందని అన్నారు. కాంగ్రెస్‌పార్టీ పాలనలోనే అన్నివర్గాలకు న్యాయం జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో చంద్రాయణపల్లి తండా నాయకులు రాగ్యానాయక్, హర్యానాయక్, శ్రీధర్‌నాయక్, గోపాల్‌నాయక్, రమేశ్, మల్లేశ్, రవి, రవినాయక్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా బ్రహ్మోత్సవాలు



తలకొండపల్లి: గోపాలస్వామికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు

తలకొండపల్లి: మండల పరిధిలోని చుక్కాపూర్‌లో వారం రోజులుగా కొనసాగుతున్న కల్కిదోనగుట్ట గోపాలస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. స్వామివారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఫౌండరీ ట్రస్టు చైర్మన్ పట్టాభిరామశర్మ, కార్యవర్గ ముఖ్య సభ్యులు కృష్ణమూర్తిశర్మ, నితిన్‌శర్మ, రాము, ప్రముఖ వ్యాపారవేత్త శ్యాంసుందర్ తదితరులు పాల్గొన్నారు.

దేవుని పడకల్ ఆలయంలో..

తలకొండపల్లి: మండల పరిధిలోని దేవుని పడకల్ శ్రీ వేంకటేశ్వర ఆలయ బ్రహ్మోత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఈనెల 31 వరకు ఉత్సవాలు కొనసాగుతాయని ఆలయ ఫౌండరీ ట్రస్టు చైర్మన్ లట్టుపల్లి రాజుకుమార్ రెడ్డి తెలిపారు. తొలిరోజు ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ రాజుకుమార్‌రెడ్డి, ఈట స్నేహలత, ఆలయ అసిస్టెంట్ ఆంజనేయులు, మాజీ సర్పంచ్ శ్రీశైలం, ఉప సర్పంచ్ తిరుపతి, వేద పండితులు పద్మనాభచార్యులు, రామాచార్యులు, శ్రీవాత్సవ, మధుకర్‌రెడ్డి, కృష్ణగౌడ్, జనార్ధన్‌రెడ్డి, రంజిత్‌రెడ్డి, రవి కుమార్‌రెడ్డి, జంగయ్య, భక్తులు పాల్గొన్నారు.

పిచ్చుకలను కాపాడుకుందాం



పిచ్చుకగూళ్లు, నీటితొట్టెలు పంపిణీ చేస్తున్న జాగృతి అభ్యుదయ సంఘం సభ్యులు

ఎల్‌బీనగర్: మానవుల మనుగడ సృష్టిలోని ఇతర జీవులతో ముడిపడి ఉందని జాగృతి అభ్యుదయ సంఘం చైర్మన్ భావన శ్రీనివాస్ అన్నారు. జాగృతి అభ్యుదయ సంఘం, సామాజిక కార్యకర్త గడ్డె విజయ్‌నేత ఆధ్వర్యంలో బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ గాయత్రీనగర్ కాలనీలో ఆదివారం ప్రపంచ పిచ్చుకల దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలు కాలనీవాసులకు పిచ్చుక గూళ్లు, వాటి నీటి కోసం మూకుళ్లు, వీధి జంతువుల కోసం నీటి తొట్టెలు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా భావన శ్రీనివాస్ మాట్లాడుతూ, పిచ్చుకలు మన ఆహార పంటలను ఆశించే చీడ పురుగులు, క్రిమి కీటకాలను తినేసి పంటలను కాపాడతాయన్నారు. పిచ్చుకలు కిచ కిచ మంటూ మన ఇంటి చుట్టూ తిరుగుతూ సందడి చేస్తుంటే పిల్లలు సంతోషంతో మైమరిచిపోతరాని అన్నారు. పర్యావరణానికి ఎంతో మేలు చేసే పిచ్చుకలు నేడు అంతరించుపోతున్నాయని, వాటిని కాపాడాల్సిన బాధ్యత మనందరిపై ఉందని అన్నారు.

◆ వేసవిలో వీధి జంతువుల దాహార్తిని తీర్చేందుకు అన్ని కాలనీ వాసులకు ఉచితంగా నీటి తొట్టెలను పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో భద్రారెడ్డి, కామేష్, మనోజ్‌కుమార్, దుర్గాప్రసాద్, రాంబాబు, శశి, జైపాల్‌రెడ్డి, సూర్యకుమారి, రమేష్, ఉపేందర్ , మధు, ఉదయ్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి నిధులివ్వండి

మాడ్గుల: మండల పరిధిలోని నల్లవారిపల్లి అభివృద్ధి కోసం నిధులు కేటయించాలని కోరుతూ ఆదివారం హైదరాబాద్‌లో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయరెడ్డికి గ్రామస్తులు వినతిపత్రం అందజేశారు. గ్రామాభివృద్ధికి సహకరిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు సంపత్ కుమార్, విజయారెడ్డి, చంద్రయ్య, మల్లేష్, పెద్దయ్య తదితరులు పాల్గొన్నారు.

జోరుగా మట్టి దందా!



క్రేన్‌తో లారీలో నింపుతున్న మట్టి

రాత్రి తవ్వి.. ఉదయం తరలింపు

- గుట్టుగా సాగుతున్న వ్యాపారం
- ప్రభుత్వ, ఫారెస్టు భూముల్లో తవ్వకాలు
- రోజుకు రూ. లక్షల్లో సమకూరుతున్న అక్రమార్జన
- పట్టించుకోని అధికారులు

తుక్కుగూడ: ఏ వ్యాపారానికైనా డిమాండ్, సప్లయ్ ఆధారంగా కార్యకలాపాలు సాగడం పరిపాటి. డిమాండ్ ఎక్కువైతే ఎక్కువ లాభలు ఆర్జించవచ్చు. ఇదే సూత్రాన్ని అక్రమార్కులు ఫాలో అవుతున్నారు. యథేచ్ఛగా మట్టి, మొరం కొల్లగొడుతున్నారు. ప్రకతి సంపద హరించుకపోతున్నా ప్రశ్నించాల్సిన యంత్రాగం చోద్యం చూస్తుందనే విమర్శలు విన వస్తున్నాయి. అధికారుల అలసత్వం కారణంగా మహేశ్వరం మండంలోని తుమ్మలూరు, శ్రీనగర్, రావిర్యాల, మంఖాల్, ఇమామ్‌గూడలో జోరుగా మట్టి దందా సాగుతుంది. దీనికోసం వ్యాపారులు ముఠాలుగా ఏర్పడి యథేచ్ఛగా మొరం తవ్వి రూ. లక్షల్లో సొమ్ము చేసుకుంటున్నారు. ఈ విషయంలో అడ్డూ అదుపు లేకుండా తవ్వకాలు చేపట్టడంతో అవి చెరువులను తలపిస్తున్నాయి.

టిప్పర్ల సహాయంతో డంప్..

శ్రీశైలం హైవేకు కూతవేటు దూరంలో తుమ్మలూరు, మంఖాల్, శ్రీనగర్ రెవెన్యూ పరిధి ప్రభుత్వ, ఫారెస్టు, అసైన్డ్ భూముల్లో కొన్ని రోజుల నుంచి మట్టి తవ్వకాలు జోరుగా సాగుతుంది. రాత్రి సయమంలో మట్టి తవ్వకాలు జరిపి టిప్పర్ల ద్వారా మున్సిపాలిటీ పరిధిలోని శ్రీనగర్ ఈ–సిటీ కమాన్ వద్ద డంప్ చేస్తున్నారు. రాత్రి డంప్ చేసి ఉదయం నగరంతో పాటు, తుక్కుగూడ, తుర్కయంజాల్, ఆదిబట్ల తదితర ప్రాంతాలకు తరలిస్తున్నారు. రోజుకు వందల్లో టిప్పర్లలో రవాణా చేస్తున్నారు. ఒక్కో టిప్పర్‌కు రూ.5వేల నుంచి రూ.6,500 వరకు విక్రయిస్తూ లక్షల్లో ఆదాయం సమకూర్చుకుంటున్నారు. మట్టిని బట్టి, మార్కెట్‌లో డిమాండ్ ఉంది. హైవే రోడ్డుపై మట్టి వ్యాపారం జోరుగా సాగుతున్న రెవెన్యూ, పోలీస్ యంత్రాంగం మాత్రం పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. కొద్ది రోజుల క్రిందట మహేశ్వరం, కందుకూరు మండలంలో ఎస్‌ఓటీ అధికారులు మట్టి మాఫియాపై దాడులు చేశారు. కానీ ఈ మట్టి కేంద్రాలపై దాడులు చేయక పోవడం అనుమానాలకు తావిస్తుంది. ఈ వ్యాపారం వెనుక రాజకీయ నాయకులతో పాటు, వివిధ శాఖల ఉన్నతాధికారులు ఉన్నట్లు సమాచారం. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రభుత్వ భూములను కాపాడి, మట్టి వ్యాపారుల ఆగడాలను నియత్రించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



శ్రీనగర్‌లో మట్టి తవ్వకాలు జరిపిన ప్రదేశం



ఈ-సిటీ కమాన్ వద్ద డంప్ చేసిన మొరం

చర్యలు తీసుకుంటాం

మట్టి తవ్వకాలు చట్ట రీత్యా నేరం. దీన్ని నివారించడానికి రెవెన్యూ సిబ్బందితో ప్రత్యేక టీమ్‌లను ఏర్పాటు చేసి నిఘా వ్యవస్థను మరింత పకడ్బందిగా ఏర్పాటు చేస్తాం. ఈ వ్యాపారంలో ఎంతటి వారు ఉన్నా సరే కఠిన చర్యలు తీసుకుంటాం.

– విజయలక్ష్మి, తహసీల్దార్, మహేశ్వరం